అందుబాటులోకి హైడ్రా సేవలు

మలక్‌పేట సర్కిల్‌–6 డీసీ జయంత్‌



చాదర్‌ఘాట్‌: వర్షాలు కురుస్తున్న నేపత్యంలో అత్యవసర వాహనాలు, అవసరమైన సిబ్బంది, పని ముట్లతో హైడ్రా సిబ్బంది అందుబాటులో ఉన్నారని మలక్‌పేట సర్కిల్‌–6 డీసీ జయంత్‌ తెలిపారు. గురువారం మలక్‌పేటలో మాట్లాడుతూ.. రెండు రోజుల్లో జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారుల మధ్య సమన్వయ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సర్కిల్‌–6 పరిధిలోని ఏడు డివిజన్‌లలో హైడ్రా వాహనాలు అందుబాటులోకి ఉంటాయని తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్‌ అధికారులు హైడ్రా అధికారులు సమన్వయంతో సమస్యలపై దృష్టి సారిస్తారని తెలిపారు. ట్రాఫిక్‌ సమస్యలు, వృక్షాలు, విద్యుత్‌ స్తంభాలు నేలకొరగడం వంటి సందర్భాలలో ఆయా ప్రాంతాల ప్రజలు జీహెచ్‌ఎంసీ అధికారులకు తెలుపాలని అన్నారు.

మార్కెట్‌ ఉద్యోగుల నిరసన



చాదర్‌ఘాట్‌: మహబూబ్‌నగర్‌ మార్కెట్‌ కమిటీ కార్యదర్శిని ఆ మార్కెట్‌ కమిటీ వైస్‌చైర్మన్‌ దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని ఏఎంసీ టీఎన్‌జీఓస్‌ సెంట్రల్‌ ఫోరం అధ్యక్షుడు నరసింహారెడ్డి, కార్యదర్శి ముక్రం అన్నారు. సంఘటనను నిరసిస్తూ గురువారం మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్‌ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మార్కెటింగ్‌ శాఖ మంత్రి, ప్రిన్సిపాల్‌ సెక్రటరీ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పుస్తకాల పంపిణీ

చైతన్యపురి: కాంగ్రెస్‌ పార్టీ యువజన నాయకుడు బొగ్గారపు శరత్‌ చంద్ర ఆధ్వర్యంలో గురువారం చైతన్యపురి డివిజన్‌ ఇందిరానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉచిత పుస్తకాల పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్‌ మల్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని కవిద్యార్థులకు పుస్తకాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఏడాది సొంత ఖర్చులతో 50వేల పుస్తకాలను పంపిణీ చేస్తున్న శరత్‌చంద్రను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, వెంకటేశ్‌చారి, రవికేశవ్‌ నాయుడు, చిన్నాగౌడ్‌, చరణ్‌, అరుణ్‌, విజయరంగ, బంటి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఐక్యంగా పోరాడాలి

నాగోలు: కార్మికులను కార్పొరేట్‌ సంస్థలకు బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఏఐటీయూసీ ఎల్‌బీనగర్‌ జోన్‌ ప్రధాన కార్యదర్శి ఎం. మద్దిలేటి అన్నారు. గురువారం కొత్తపేట డివిజన్‌ న్యూనాగోలు కాలనీలో ఎల్‌బీనగర్‌ జోన్‌ మున్సిపల్‌ కార్మికుల జనరల్‌ బాడీ సమావేశం లక్ష్మీ, లక్ష్మమ్మ, జయమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు ఐక్యంగా ఉండి కోడ్‌లు రద్దయ్యేంతవరకు పోరాటలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అండాలు, ఇందిరమ్మ, మంజుల, జ్యోతి, ఎల్లయ్య, దయాకర్‌, యాదమ్మ, వెంకటమ్మ, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో కార్మికులు భాగస్వాములవ్వాలి

హస్తినాపురం: దేశవ్యాప్త సమ్మెలో జీహెచ్‌ఎంసీ ఔట్‌ సోర్సింగ్‌, కాంట్రాక్ట్‌ ఉద్యోగులంతా పాల్గొని విజయవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ ఎంప్లాయీస్‌ యూనియన్‌ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం కర్మన్‌ఘాట్‌ చౌరస్తాలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, లేబర్‌కోడ్స్‌లను రద్దు చేయాలని ఆయన డిమాండ్‌ చేశారు. జీహెచ్‌ఎంసీ కార్మికులకు ఉద్యోగ భద్రతతోపాటు ఇళ్లహక్కు కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లు, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్‌ నాయకులు జంగయ్య, ఎల్లమ్మ, పద్మ, యాదమ్మ, వెంకటమ్మ, రాములమ్మ, సువర్ణ, మల్లయ్య, సురేశ్‌, కళావతి తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి మొదటి ప్రాధాన్యం

సైదాబాద్‌: డివిజన్‌ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, బస్తీల్లోని అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని సైదాబాద్‌ కార్పొరేటర్‌ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం సైదాబాద్‌ జీఏ–1 కాలనీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రహదారి పనులను కార్పొరేటర్‌ జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని పలు ప్రాంతాలలో తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్‌ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పైప్‌లైన్‌ పనులు పూర్తయిన వెంటనే ఆయా ప్రాంతాల్లోనూ రహదారులు ఆధునీకరిస్తామని కార్పొరేటర్‌ తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజ్‌కుమార్‌, కాలనీవాసులు రామకృష్ణ, ఆనంద్‌, మోహన్‌, రాజేంద్రప్రసాద్‌ పాల్గొన్నారు.

ఇంటింటా జ్వర సర్వే.!

మలక్‌పేటలో రక్త నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది



చాదర్‌ఘాట్‌: వర్షాకాలంలో వ్యాధులు విజృంభిస్తుండటంతో మలకపేట నియోజకవర్గంలో వ్యాధుల నివారణకు జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారికి ఇంటింటికీ యూపీహెచ్‌ఎస్‌ వారు సర్వే చేపట్టారు. నియోజకవర్గ పరిధిలో మూసారాంబాగ్‌, ఓల్డ్‌మలక్‌పేట, అజంపురా, సైదాబాద్‌, అక్బర్‌బాగ్‌ డివిజన్‌లలో ఉన్న 4 యూపీహెచ్‌సీలతో పాటు బస్తీ దవాఖానాల పరిధిలో ఈ సర్వే నిర్వహిస్తున్నారు. జ్వర బాధితులు ఉంటే వెంటనే మందులు అందిస్తున్నారు. అదేవిధంగా బాధితులు ఉంటే వైద్య శిబిరాలు కూడా నిర్వహిస్తున్నారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్‌, తదితర సీజనల్‌ వ్యాధుల నిర్వారణ అయినట్టు తెలియగానే వైద్య బృందాలు రంగంలోకి దిగుతాయి. మలేరియా, టైఫాయిడ్‌, డెంగీ ఉంటే రక్త నమూనాలు సేకరించి టీ హబ్‌ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా రోగాల బారిన పడకుండా ఉండొచ్చు. కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలి. జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలోని బస్తీ దవాఖానా, యూపీహెచ్‌సీలో వైద్యులను సంప్రదించాలి. సీజనల్‌ వ్యాధుల పట్ల ప్రజలు నిర్లక్ష్యంగా ఉండొద్దు.

– ఓల్డ్‌మలక్‌పేట యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా. తరుణి

స్టీల్‌ బ్రిడ్జి పనుల్ని అడ్డుకున్న భక్తులు

హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా నిర్మాణ చేపట్టొద్దని నిరసన



చంచల్‌గూడ: హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా శాస్త్రానికి వ్యతిరేకంగా బ్రిడ్జి నిర్మాణం చేయొద్దని ప్రాజెక్టు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకుండా పనులు కొనసాగిస్తున్నారని సైదాబాద్‌ హనుమాన్‌ దేవాలయ పరిరక్షణ సమితి సభ్యులు గురువారం పనులను అడ్డుకున్నారు. 2020లో మలక్‌పేట నియోజకవర్గం సైదాబాద్‌ మెయిన్‌లో స్టీల్‌ బ్రిడ్జి నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ శాఖ అధికారులు మార్కింగ్‌ చేస్తున్న క్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. మెజార్టీ హిందువుల మనోభావాలను గౌరవిస్తూ ఆలయం మీదుగా బ్రిడ్జి నిర్మాణం ఆపాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను పలుమార్లు కలిసినా పట్టించుకోవడం లేదన్నారు. భక్తుల ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో అధికారులు వారితో మాట్లాడారు. అతి త్వరలో సమస్యను పరిష్కరిస్తామని ప్రాజెక్ట్‌ ఈఈ గోపాల్‌ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో నాయకులు రవీందర్‌రెడ్డి, నిరంజన్‌ యాదవ్‌, ఉగాది మహేష్‌, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

వివాదాలు సమసిపోయే వరకు పనులు మొదలు పెట్టొద్దు..

సైదాబాద్‌: స్టీల్‌ బ్రిడ్జ్‌ నిర్మాణం విషయమై అన్ని వివాదాలు, అభ్యంతరాలు పూర్తిగా సమసిపోయే వరకు స్టీల్‌ బ్రిడ్జ్‌ పనులు మొదలు పెట్టవద్దని బీజేపీ భాగ్యనగర్‌ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌ యాదవ్‌ తేల్చి చెప్పారు. పనులు తిరిగి మొదలు పెట్టేందుకు గురువారం అధికారులు వచ్చి సిబ్బందితో బారికేడ్లు ఏర్పాటు చేస్తుండగా బీజేపీ నాయకులు వారిని అడ్డుకున్నారు. అభివృద్ధి పనులకు తాము కూడా సహకరిస్తామని కానీ వివాదం వలన చెలరేగిన పలు సమస్యలను పరిష్కరించిన తర్వాతనే పనులు మొదలు పెట్టాలన్నారు.

మాక్‌డ్రిల్‌



మాక్‌ డ్రిల్‌లో భాగంగా క్షతగాత్రులను తరలిస్తున్న ఫైర్‌ సిబ్బంది



అవగాహన కల్పిస్తున్న డీఎఫ్‌వో వెంకన్న

మలక్‌పేట: హైద్రాబాద్‌ జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మూసారంబాగ్‌లోని నెక్స్‌ గలేరియా మాల్‌లో గురువారం మాక్‌ డ్రిల్‌ నిర్వహించారు. ఫైర్‌ఇంజిన్లు, 108 అంబులెన్స్‌లు, సైరన్‌లతో మోతలతో వాహనాలు ఒక్కసారిగా మాల్‌కు చేరుకున్నాయి. ఫైర్‌ ఇంజన్‌లతో నీళ్ల కొట్టడం, క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లోకి ఎక్కించడం, జనం అంతా గూమికూడటంతో అక్కడి వారంతా ఉలిక్కిపడ్డారు. ఇదంతా అగ్నిమాపక శాఖ మాక్‌ డ్రిల్‌ అని తెలియడంతో అందరూ ఊపరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా హైద్రాబాద్‌ జిల్లా ఫైర్‌ ఆఫీసర్‌ తగరం వెంకన్న మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమయస్ఫూర్తిగా ఎలా వ్యవహరించాలో అవగాహన కల్పించారు. ప్రమాద సమయంలో భవనం పై నుంచి రావడానికి లిఫ్ట్‌ వాడకూడదన్నారు. ప్రతీ ఇంట్లో ప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని, ఫైర్‌ స్టేషన్‌ ఫోన్‌ నంబర్లు ప్రతీ ఒక్కరి సెల్‌ఫోన్‌లో ఫీడ్‌ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట ఫైర్‌ ఆఫీసర్‌ షౌకత్‌, గలేరియా మాల్‌ ఇన్‌చార్జి పంకజ్‌ శర్మ, సుబ్రమణ్యం, ఫైర్‌, 108 అంబులెన్స్‌ సిబ్బంది పాల్గొన్నారు.

20న మన్సూరాబాద్‌లో పోచమ్మ బోనాలు

మన్సూరాబాద్‌: మన్సూరాబాద్‌లో ఈ నెల 20న పోచమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్‌, మాజీ కార్పొరేటర్‌ కొప్పుల విఠల్‌రెడ్డి తెలిపారు. బోనాల ఉత్సవాల ప్రత్యేక సమావేశం చైర్మన్‌ విఠల్‌రెడ్డి అధ్యక్షతన గురువారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 13న పోచమ్మ దేవాలయంలో శాకాంబరీ ఉత్సవాలు ఉంటాయని తెలిపారు. 18న నాగోలు డివిజన్‌పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయం నుంచి పోచమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు నాంపల్లి శంకరయ్య, పోచబోయిన గణేష్‌యాదవ్‌, కొప్పుల ఉపేందర్‌రెడ్డి, బొల్లు యాదయ్య, గుర్రం వెంకట్‌రెడ్డి, నాంపల్లి కృష్ణ, జగదీష్‌, ఈశ్వర్‌, అమరనాథ్‌, అర్చకులు శ్రీధరాచార్యులు పాల్గొన్నారు.

నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మన్సూరాబాద్‌: సీసీ రోడ్డు నిర్మాణంలో సరైన లెవల్స్‌ పాటిస్తూ నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని మన్సూరాబాద్‌ కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. మార్నింగ్‌ వాక్‌లో బాగంగా డివిజన్‌ హయత్‌నగర్‌ పరిధి పవనగిరికాలనీలో గురువారం కార్పొరేటర్‌ సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. కాలనీలవాసులు తమ ఇంటి ఎదుట ఉన్న ర్యాంపులను, మెట్లను, చెట్ల నిర్మాణ గోడలను స్వచ్ఛందంగా తొలగించుకుని రోడ్డు నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వేణుగోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సందీప్‌ రెడ్డి, సుధాకర్‌గౌడ్‌, ఎస్కే వల్లీ, నాగేశ్వర్‌రావు, నర్సింహ, కృష్ణమూర్తిగౌడ్‌ పాల్గొన్నారు.

ఓపెన్‌ జిమ్‌ ప్రారంభం

మన్సూరాబాద్‌ పెద్దచెరువు ప్రాంగణంలో నూతనంగా మరో ఓపెన్‌ జిమ్‌ను కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గురువారం ప్రారంభించారు.



పవనగిరికాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి

ఓటరు జాబితా నవీకరణలో బీఎల్‌ఓలు కీలకం



బీఎల్‌ఓల శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న డీసీ మంగతాయారు

సైదాబాద్‌: ఓటరు జాబితా నవీకరణ, సవరణల్లో బూత్‌ లెవల్‌ ఆఫీసర్‌ (బీఎల్‌ఓ)లు కీలకంగా వ్యవహరిస్తారని సంతోష్‌నగర్‌ సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ మంగతాయారు అన్నారు. గురువారం ఐఎస్‌ సదన్‌ డివిజన్‌ పరిధిలోని వినయనగర్‌ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నూతన బీఎల్‌ఓలకు ఓటరు జాబితా రూపకల్పనపై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని డీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఎల్‌ఓలకు ఇచ్చిన యాప్‌ల ద్వారా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని సూచించారు. ఇంటింటికి తిరగడం ద్వారా ఓటర్ల పూర్తి వివరాలు, ఆధారాలు సేకరించాలని తెలిపారు. ఓటరు జాబితా రూపొందించడంలో నూతనంగా వచ్చిన నిబంధనలు, మార్పులు, సడలింపులపైన, ఫాం నెంబర్‌: 6, 7, 8లపై బీఎల్‌ఓలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని డీసీ వారికి సూచించారు. కార్యక్రమంలో అధికారులు సురేందర్‌గౌడ్‌, మహ్మద్‌ ఫసీయుద్దీన్‌, రత్నమ్మ పాల్గొన్నారు.

పీర్లకు దట్టీల సమర్పణ



మలక్‌పేట: పీర్ల పండుగ మత సామరస్యతకు ప్రతీక అని మలకపేట ఇన్‌స్పెక్టర్‌ పిడమర్తి నరేష్‌ అన్నారు. మొహరం సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌, ఎస్సై కే. రాజశేఖర్‌రెడ్డి, మలక్‌పేట మైత్రీ కమిటీ కన్వీనర్‌ లింగాల శ్రీనివాస్‌గౌడ్‌ గడ్డిఅన్నారం అషూర్‌ ఖానాలోని పీర్ల దర్శించుకుని దట్టీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌ మాట్లాడుతూ.. ఆధ్యాత్మికత ఉట్టిపడే విధంగా పండుగలు, ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. నిర్వాహకులు ఇన్‌స్పెక్టర్‌, ఎస్సైలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, శివకుమార్‌, ప్రవీణ్‌కుమార్‌, నిర్వాహకులు ఫిరోజ్‌ఖాన్‌, అజ్మల్‌ఖాన్‌, అబ్దుల్‌ పాషా, తదితరులు పాల్గొన్నారు.

9న కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మె

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి



ఆటోనగర్‌ పారిశ్రామికవాడలోని కంపెనీలకు సమ్మె నోటీసులు అందజేస్తున్న సీఐటీయూ నేతలు

మన్సూరాబాద్‌: కేంద్ర ప్రభుత్వం కార్మికవర్గానికి తీవ్ర అన్యాయం చేస్తుందని, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. డివిజన్‌ పరిధి ఆటోనగర్‌ పారిశ్రామికవాడలోని వివిధ కంపెనీల యాజమన్యాలను కలిసి 9న జరిగే సమ్మెకు సహకరించాలని గురువారం సమ్మె నోటీసులు అందజేశారు. కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటీష్‌ కాలం నుంచి పోరాడి తెచ్చుకున్న కార్మిక హక్కులు, చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకురావడం సరికాదన్నారు. ఆ లేబర్‌ కోడ్‌లో కనీస పని గంటలను 12గంటలకు పెంచారని, కంపెనీ యజమాన్యాలకు ఇష్టానుసారంగా కార్మికులు పని చేయాలనే నిబంధనలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి ఎల్లయ్య, నందగిరి ఆంజనేయులు, కార్మికులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత



చంపాపేట: సీఎం రిలీఫ్‌ ఫండ్‌ పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్‌ చిలుక బస్తీకి చెందిన నిఖిత చికిత్స కోసం మంజూరైన సీఎంఆర్‌ఎఫ్‌ ఎల్‌ఓసీ గురువారం ఎమ్మెల్యే అందజేశారు. రూ.1.50లక్షల ఎల్‌ఓసీ మంజూరు కావటంతో లబ్ధిదారురాలి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

సింగరేణి గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

జిల్లా కలెక్టర్‌కు కోట్ల శ్రీనివాస్‌ వినతి



జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన కోట్ల శ్రీనివాస్‌

సైదాబాద్‌: ఐఎస్‌సదన్‌ డివిజన్‌ పరిధిలోని సింగరేణి కాలనీలో 30 సంవత్సరాలుగా నివసిస్తున్న గుడిసెవాసులకు అక్కడే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని హైదరాబాద్‌ జిల్లా వ్యవసాయ మార్కెట్‌ కమిటీ వైస్‌చైర్మన్‌ కోట్ల శ్రీనివాస్‌ కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌ జిల్లా కలెక్టర్‌ను ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి కాలనీలో నివసించే గుడిసెవాసులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆధార్‌, ఓటర్‌, రేషన్‌ కార్డులు అన్నిరకాల ధ్రువపత్రాలు మంజూరై ఉన్నాయన్నారు. సింగరేణి గుడిసెల ప్రాంతంలో జీహెచ్‌ఎంసీ అధికారులు రహదారులు, వీధిదీపాలు వంటి పలు రకాల మౌలిక వసతులు కూడా కల్పించారని ఆయన వివరించారు. అయితే ఇటీవల సింగరేణి కాలనీపై కన్నేసిన కొందరు సొసైటీల పేరుతో ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను తప్పు దారి పట్టిస్తున్నారని ఆరోపించారు. గుడిసెవాసులను తొలగించి తాము ఇక్కడి స్థలం పొందుదామని సొసైటీల పేరుతో కుట్రలు పన్నుతున్నారని అన్నారు. అవసరమైతే సింగరేణి కాలనీ గుడిసెవాసుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం చేస్తామని ఆయన అన్నారు. తన వినతికి జిల్లా కలెక్టర్‌ సానుకూలంగా స్పందించారని కోట్ల శ్రీనివాస్‌ తెలిపారు.

‘సామాజిక న్యాయ’ సమరభేరిని జయప్రదం చేయాలి

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీగౌడ్‌

మన్సూరాబాద్‌: కాంగ్రెస్‌ పార్టీ గ్రామశాఖల అధ్యక్షుల సమ్మేళనమైన సామాజిక న్యాయ సమరభేరి సభను జయప్రదం చేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీగౌడ్‌ పిలుపునిచ్చారు. మన్సూరాబాద్‌ డివిజన్‌ హయత్‌నగర్‌ పరిధిలోని టీఎన్‌జీఓస్‌ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో ఎల్‌బీనగర్‌ ముఖ్య నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్‌ పార్టీ జనరల్‌ సెక్రటరీలు గజ్జెల కాంత, శశికళ యాదవరెడ్డి, మిధున్‌రెడ్డిలతో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

◆ ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ... కాంగ్రెస్‌ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఎల్‌బీనగర్‌ నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. పార్టీకి ప్రభుత్వానికి అనుసంధానం ముఖ్యమని, పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. ఆ దిశగా పార్టీకి, ప్రభుత్వానికి అనుసంధానం మరింత పెంచేందుకు మల్లికార్జున ఖర్గే సమ్మేళనానికి హాజరవుతున్నారని తెలిపారు. పార్టీ అధికారంలోకి రావటానికి ఎంతోమంది కార్యకర్తలు కష్టపడి పనిచేశారని, పదవుల కోసం వేచి చూస్తున్నారని, సంయమనం పాటిస్తే పదవులు వరిస్తాయని పేర్కొన్నారు.

◆ నగరంలోని పార్టీకి ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేటర్లు లేనందున కార్యకర్తలను గుర్తించి నామినేటెడ్‌ పదవులు ఇచ్చి ప్రోత్సహించాలని అధిష్టానానికి వివరించానని స్పష్టంచేశారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి సరైన రీతిలో వెళ్లడం లేదని, ప్రతి కార్యకర్త ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వజీర్‌ ప్రకాష్‌గౌడ్‌, లక్ష్మీప్రసన్నగౌడ్‌, నాయకులు వెంకట్‌యాదవ్‌, గజ్జి భాస్కర్‌ యాదవ్‌, శ్రీపాల్‌రెడ్డి, బండ సురేందర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్‌

సివిల్‌ తగాదాలో పోలీసు అత్యుత్సాహం

- అక్రమంగా పీఎస్‌లో గిరిజన మహిళా నేత కట్టడి
- సైదాబాద్‌ ఠాణా ముందు బైఠాయించిన మహిళలు



ఠాణా ముందు బైఠాయించిన సేవాలాల్‌ బంజారా సంఘం నేతలు

సైదాబాద్‌: సింగరేణి కాలనీలో ఇరువురి మధ్య అప్పు విషయమై తగాదా ఏర్పడింది. పూర్తిగా సివిల్‌ వ్యవహారమైన ఈ విషయంలో సైదాబాద్‌ ఎస్సై తలదూర్చారు. అంతే కాకుండా మధ్యవర్తిగా వచ్చిన గిరిజన మహిళా నాయకురాలిని అసభ్యంగా దూషించడమే కాకుండా ‘నీ పైన కేసులు నమోదు చేస్తా’అంటూ ఆమె ఫోన్‌ గుంజుకొని పీఎస్‌లోనే ఉండాలంటూ కట్టడి చేశాడు. విషయం తెలుసుకున్న సేవాలాల్‌ బంజారా సంఘం నాయకులు, మహిళలు గురువారం సైదాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ ఎదుట ధర్నాకు దిగారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఎస్సైను ప్రశ్నించడంతో...

◆ సింగరేణి కాలనీలో నివసించే శివాలాల్‌ తన బంధువు అయిన మైఖేల్‌ వద్ద రెండేళ్ల క్రితం రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. అయితే ఈ అప్పు తిరిగి చెల్లించేందుకు శివాలాల్‌ సిద్ధంగా ఉన్నా మైఖేల్‌కు అతని కుమారుడికి ఉన్న గొడవల వల్ల చెల్లింపు వాయిదా పడుతూ వచ్చింది. ఈ విషయంలో సైదాబాద్‌ ఎస్సై సాయికృష్ణ కలుగజేసుకున్నాడు. గురువారం శివాలాల్‌ను పీఎస్‌కు పిలిచి మాట్లాడుతున్నాడు. మధ్యవర్తిగా సేవాలాల్‌ బంజారా సంఘం మహిళా అధ్యక్షురాలు, సీపీఐ నగర నాయకురాలు సక్రిబాయి వెళ్లింది. సివిల్‌ కేసు విషయంలో మీరెందుకు జోక్యం చేసుకుంటున్నారని ఆమె ప్రశ్నించింది.

◆ సాయికృష్ణ కోపంతో ఆమెను దుర్భాషలాడాడు. ‘నీ పైన కేసులు నమోదు చేస్తా..’అంటూ బెదిరిస్తూ ఆమె ఫోన్‌ తీసుకొని పీఎస్‌లోనే ఉండాలంటూ ఆర్డర్‌ వేసాడు. విషయం తెలుసుకున్న సేవాలాల్‌ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మోతీలాల్‌ నాయక్‌ మహిళా నేతలతో అక్కడికి వచ్చి పీఎస్‌ ముందు బైఠాయించారు. వెంటనే పోలీసులు సక్రిబాయిని వదిలేసారు. వారితో చర్చించి పీఎస్‌ నుంచి పంపించేశారు.

ఎస్సైపై చర్యలు లేకుంటే కమిషనరేట్‌ను ముట్టడిస్తాం: మోతీలాల్‌



సింగరేణి కాలనీలో నివసించే గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని సెక్టార్‌ ఎస్సై సాయికృష్ణ ఎన్నో అక్రమాలకు పాల్పడుతున్నాడని సేవాలాల్‌ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మోతీలాల్‌ నాయక్‌ అన్నారు. ప్రైవేట్‌ వ్యక్తులను నియమించుకొని అక్రమ దందాలు నిర్వహించే వారి నుంచి బహిరంగంగా మామూళ్లు వసూలు చేస్తున్నాడని తెలిపారు. సివిల్‌ కేసు వ్యవహారంలోనూ ఎస్సై మహిళా నేతను ఇబ్బందులకు గురి చేశాడు. సైదాబాద్‌ ఇన్‌స్పెక్టర్‌ ఆయనపై చర్యలు తీసుకుంటామన్నారు. వారంలోపు ఎస్సై సాయికృష్ణపై చర్యలు తీసుకోకుంటే వేలాదిగా తరలి వెళ్లి నగర పోలీస్‌ కమిషనర్‌ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.